# అన్వేష్ చుట్టూ బిగుసుకుంటున్న ఉచ్చు

వరంగల్, అక్టోబర్ 2 : కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసి బోగస్ ఫైళ్లను సృష్టించి రూ.2.31 కోట్లు దోచుకున్న బల్దియా సీనియర్ అసిస్టెంట్ బండా అన్వేష్ చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది. అప్పటి కమిషనర్, ప్రస్తుత సీడీఎంఏ పమేలా సత్పతి సంతకం ఫోర్జరీతో కోట్ల సొమ్మును కాజేయడం బల్దియాలో ప్రకంపనలు సృష్టించింది. సీడీఎంఏ పమేలా సత్పతి ఆదేశాలతో శాఖాపరమైన విచారణ జరిపి కుంభకోణం వాస్తవమే అని తేల్చారు. అధికారుల ఫిర్యాదుతో పోలీసులు అన్వేష్‌పై నమోదు చేయడం చకచకా జరిగిపోయాయి. అయితే కుంభకోణ సూత్రధారి నేరుగా కోర్టులో లొంగిపోవడంతో పూర్తి వివరాలు బయటకు రాలేదు. కాగా, దోచుకున్న ప్రజాధనం ఎవరెవరి ఖాతాల్లో జమైందని పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే మట్టెవాడ పోలీసులు చెక్కులు, వోచర్ల జిరాక్స్ కాపీలను అకౌంట్ సెక్షన్ నుంచి తీసుకున్నారు. వారిని విచారిస్తే మరింత మంది పేర్లు బయటకు వస్తాయని పోలీసులు భావిస్తున్నారు.

### కస్టడీ కోరనున్న పోలీసులు..

రిమాండ్‌లో ఉన్న బండా అన్వేష్‌ను నేడో, రేపో పోలీసులు విచారణ కోసం కస్టడీలోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఖమ్మం జైలులో ఉన్న అన్వేష్‌ను విచారణ కోసం పోలీస్ కస్టడీకి అప్పగించాలని మంగళవారం పోలీసులు కోర్టును కోరనున్నారు. మరోవైపు సీడీఎంఏ పమేలా సత్పతి ఆదేశాలతో బల్దియా అధికారులు శాఖాపరమైన విచారణ చేస్తున్నారు. బోగస్ ఫైళ్లు, చెక్కు బుక్కులను సీడీఎంఏ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

- **ఫోర్జరీ సంతకాలతో దోచుకున్న రూ.2.31 కోట్లు జమచేసిన ఖాతాలపై ఆరా**
- **పోలీసుల చేతికి వోచర్లు, చెక్కుల జిరాక్సులు**
- **నేడో, రేపో పోలీసులు కస్టడీ కోరే అవకాశం**


ఎన్ఐఏ అధికారులు సోదా చేసిన ప్రకాశ్‌రెడ్డిపేటలోని అనిత నివాసం ఇదే..

# నగరంలో ఎన్ఐఏ సోదాలు

- **చైతన్య మహిళా సంఘం నేత అనిత, అమరుల బంధుమిత్రుల కమిటీ సభ్యురాలు శాంతమ్మ ఇంట్లో తనిఖీలు**
- **మీడియా ప్రతినిధులు రాకుండా ప్రకాశ్‌రెడ్డి పేట, పైడిపల్లిలోని అనుమానితుల ఇళ్ల వద్ద పోలీసుల మోహరింపు**

సుబేదారి, అక్టోబర్ 2 : వరంగల్ నగరంలో రెండు చోట్ల కేంద్ర దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు సోదాలు నిర్వహించడం కలకలం సృష్టించింది. నిషేధిత మావోయిస్టు పార్టీ అనుబంధ సంఘాల్లో పనిచేస్తున్నారనే అభియోగంతో ఎన్ఐఏ అధికారులు సోమవారం హనుమకొండ ప్రకాశ్‌రెడ్డిపేటలో చైతన్య మహిళా సంఘం నాయకురాలు అనిత, పైడిపల్లిలో అమరుల బంధుమిత్రుల కమిటీ సభ్యురాలు శాంతమ్మ ఇంట్లో సోదాలు చేశారు. రెండు బృందాలుగా విడిపోయిన అధికారులు ఏకకాలంలో అనిత, శాంతమ్మ ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. ఉదయం 6 గంటలకే స్థానిక పోలీసులతో కలిసి వారి నివాసాలకు వెళ్లిన అధికారులు క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. మీడియా ప్రతినిధులు లోపలికి రాకుండా ఇంటి ముందు పోలీసులను మోహరించారు. కాగా, ఎన్ఐఏ అధికారులు వచ్చిన సమయంలో అనిత ఇంటి వద్ద లేనట్లు తెలిసింది. అనారోగ్యంతో హాస్పిటల్‌లో అడ్మిట్ అయినట్లు సమాచారం.

# కాంగ్రెస్ ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్‌తో ప్రాణహాని

- **కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన నాపై కక్ష సాధింపు చర్యలు**
- **వేలేరు ఎంపీటీసీ-2 బత్తుల జ్యోతి**

వేలేరు, అక్టోబర్ 2 : కాంగ్రెస్ పార్టీకి చెందిన వేలేరు ఉప సర్పంచ్ సద్దాంహుస్సేన్ తనను మానసిక వేధింపులకు గురి చేస్తున్నాడని, అతనితో ప్రాణహాని ఉందని వేలేరు బీఆర్ఎస్ ఎంపీటీసీ -2 బత్తుల జ్యోతి తెలిపారు. సోమవారం వేలేరులో ఆమె మాట్లాడుతూ.. తాను కాంగ్రెస్ నుంచి ఎంపీటీసీగా గెలిచానని, బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి పార్టీలో చేరానన్నారు. దీంతో సద్దాంహుస్సేన్ సోషల్ మీడియాలో తనపై దుర్భాషలాడాడని, తన భర్త నిరంజన్ బతికున్న సమయంలో గొడవ పెట్టుకుని కొట్టాడని, తమ ఇంటి స్థలం విషయంలో కూడా తలదూర్చి గొడవలకు దిగాడని ఆమె ఆరోపించారు. కాగా, తన భర్త ఇటీవల అనారోగ్యంతో మరణించగా, ఇద్దరు ఆడపిల్లలు కలిగిన నాకు ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆర్థికసాయం అందించారని తెలిపారు. బీఆర్ఎస్ అండగా నిలిచిందన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఇంటి స్థలం కోసం వేలేరు జీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రామసభలో దరఖాస్తు చేసుకోగా, ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ సోషల్ మీడియాలో తనపై ఇష్టారీతిన ప్రచారం చేస్తూ, తనను అవమానించేలా పోస్టులు పెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరినందుకే తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్‌లో తనకు ప్రాధాన్యం లేకపోవడంతోనే బీఆర్ఎస్‌లో చేరానని తెలిపారు. పార్టీ మారితే ఒక దళిత మహిళా ఎంపీటీసీని బాధపెట్టడం ఎంత వరకు సమంజసమని, తనకు నచ్చిన పార్టీలో చేరే హక్కు లేదా అని ప్రశ్నించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వేలేరు ఎంపీటీసీ -2 బత్తుల జ్యోతి

## తండ్రిపై దాడి చేసిన ఐదుగురిపై కేసు నమోదు

గోవిందరావుపేట, అక్టోబర్ 2 : గోవిందరావుపేటలోని తారకరామ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లుతో పాటు అతడి తల్లి రోశమ్మ, పని మనిషి బోయిని సుమలతపై దాడి చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పస్రా ఎస్సై షేక్ మస్తాన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఆదివారం సన్నగండ్ల వెంకటేశ్వర్లు, రోశమ్మ, సుమలతపై దాడికి చేసిన వెంకటేశ్వర్లు భార్య సాంబలక్ష్మి అతడి కుమారులు వివేక్, శ్రావణ్, కుమార్తె గద్దల తేజశ్రీ, అల్లుడు లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కర్రలు, చైన్‌లతో కొట్టి చంపాలని చూశారని, వారితో తమకు ప్రాణభయం ఉందని వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## ఆర్టీసీ ఐటీఐ కాలేజీలో 9న 'వాక్ ఇన్ అడ్మిషన్స్'

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 2 : ఆర్టీసీ ఐటీఐ కాలేజీలో 2023-24 విద్యా సంవత్సరానికి ఐదో విడుత అడ్మిషన్లకు 8వ తేదీలోపు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 9న వాక్ ఇన్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వంగల మోహన్‌రావు తెలిపారు. iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. 9న ఉదయం 10 గంటలకు ఆర్టీసీ ఐటీఐ కాలేజీ/ఆర్టీసీ జోనల్ శిక్షణ కాలేజీలో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, 2 సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరై అడ్మిషన్ పొందాలని, వివరాలకు 0870-2982043, 98494 25319 నంబర్లలో సంప్రదించాలని కోరారు.


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న గంగు ఉపేంద్రశర్మ

## భక్తుల్లో ఆధ్యాత్మిక భావన కలిగించాలి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 2 : ధూప, దీప, నైవేద్య అర్చకులు గ్రామాల్లోని భక్తులు దేవాలయానికి వచ్చేలా వారిలో ఆధ్యాత్మిక భావన కలిగించాలని తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ సూచించారు. హనుమకొండలోని టీటీడీలో దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్వహిస్తున్న అర్చకులకు పునశ్చరణ తరగతులు కొనసాగుతున్నాయి. సోమవారం రెండో రోజు పాంచరాత్ర ఆగమానుసారం పూజలు నిర్వహించడంపై కృష్ణయజుర్వేద పండితులు గుదిమెళ్ల విజయకుమారాచార్యులు, చాత్తాదవైష్ణవ రాష్ట్ర నాయకులు వరియోగుల శ్రీనివాసస్వామి, గంగు ఉపేంద్రశర్మ శిక్షణ ఇచ్చారు. దేవాదాయ పరిశీలకులు సంజీవరెడ్డి, అనిల్, విజయ్ పర్యవేక్షించారు. భద్రకాళి దేవస్థానం అర్చకులకు అన్నప్రసాద వితరణ చేశారు.

# రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వలంటీర్స్ క్యాంపెయిన్

వెంకటాపూర్, అక్టోబర్ 2 : పాలంపేట గ్రామంలోని రామప్ప హరిత హోటల్‌లో సోమవారం వరల్డ్ హెరిటేజ్ వలంటీర్స్ క్యాంపెయిన్ ప్రారంభమైంది. ముఖ్య అతిథిలుగా ఎస్పీ గౌష్ ఆలం, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పాపారావు, సర్పంచ్ డోలి రజిత, కాకతీయ హెరిటేజ్ ప్రోగ్రాం ఆర్గనైజర్ శ్రీధర్‌రావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సూర్యకిరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తాను సివిల్ సర్వీసెస్‌కు ప్రిపేర్ అవుతున్నప్పుడు చరిత్ర ఒక సబ్జెక్టుగా తీసుకున్నానని, ఆ తర్వాతే వారసత్వ కట్టడాలు, పర్యాటక ప్రదేశాలపై అవగాహన పెరిగిందన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి మాట్లాడుతూ.. రామప్పకు ప్రపంచ వారసత్వ సంపద హోదా ఎలా లభించిందో వివరించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. రామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ హోదా రావడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్, సేవా టూరిజం అధ్యక్షుడు కుసుమ సూర్యకిరణ్ మాట్లాడుతూ.. టూరిజానికి పునాది హెరిటేజ్ అండ్ కల్చర్ అని అన్నారు. రామప్పలో ఈ కార్యక్రమాన్ని రెండోసారి నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి 40 మంది వలంటీర్లు, ఎస్సై తాజొద్దీన్, కాకతీయ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్స్ మహేశ్, కొక్కుల ప్రశాంత్, ట్రస్ట్ సిబ్బంది శ్రీనివాస్, హరిత హోటల్ మేనేజర్ రంజిత్, సిబ్బంది పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ములుగు జిల్లా ఎస్పీ గౌష్ ఆలం

## డెంగీతో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

కాటారం, అక్టోబర్ 2 : మండలంలోని చిద్నెపల్లి జీపీ పరిధి బొప్పారం గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి అంతర్గాం ఆనంద్(21) డెంగీతో పాటు పచ్చ కామెర్ల వ్యాధితో బాధపడుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సారంగం కుమారుడు ఆనంద్ హైదరాబాద్‌లో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. వారం కిందట జ్వరం రాగా ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అయినా తగ్గకపోయేసరికి నాలుగు రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. కుటుంబసభ్యులు హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి డెంగీతో పాటు పచ్చ కామెర్లు కూడా ప్రబలినట్లు గుర్తించారు. పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందినట్లు తెలిపారు.

## రేపు గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె

వరంగల్ 2 : ఆలిండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం సెంట్రల్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు గ్రామీణ తపాలా ఉద్యోగులు ఒక్క రోజు సమ్మె నిర్వహించనున్నట్లు డివిజనల్ సెక్రటరీ బొద్దున వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ పోస్టల్ డివిజన్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కమలేశ్ చంద్ర జీడీఎస్‌కు అనుకూలంగా ఇచ్చిన సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై సమ్మె ద్వారా నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు.

# చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి : ఆర్సీవో

కమలాపూర్, అక్టోబర్ 2 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వరంగల్ రీజినల్ కో ఆర్డినేటర్ (ఆర్సీవో) మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం కమలాపూర్ ఎంజేపీ బాలుర విద్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా గురుకులాల అండర్-14,19 విభాగంలో క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష్యంతో ఆడితేనే గెలుపు సాధ్యమవుతుందని, క్రీడలతోనే గుర్తింపు వస్తుందన్నారు. గురుకులాల విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తున్నారని, పతకాలు సాధించి తల్లిదండ్రులు, దేశానికి గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఈ క్రీడల్లో 17 బీసీ గురుకుల పాఠశాలల విద్యార్థులు, 7 జూనియర్ కళాశాలలకు చెందిన 850 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్-19 కబడ్డీ పోటీల్లో కమలాపూర్-శాయంపేట జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో గురుకుల విద్యా సంస్థల జిల్లా కన్వీనర్ సరిత, ప్రిన్సిపాల్స్ మల్లయ్య, ప్రఫుల్లదేవి, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, పీఈటీలు నాగరాజు, వెంకటేశ్, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్సీవో మనోహర్‌రెడ్డి